సిబ్బంది నియామకంపై రచ్చ..రచ్చ

- నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో చర్చ
- ఉన్నతాధికారి పేరుతో 28 మంది నియామకంపై కౌన్సిలర్లు అభ్యంతరం
- ఆ అధికారి పేరు చెప్పాలని డిమాండ్
- సిఫార్సు లేఖను కౌన్సిల్‌కు చూపాలని పట్టుబట్టిన ఎమ్మెల్యే ముస్తఫా
- సిబ్బందిని నిలిపివేయాలని మేయర్ ఆదేశాలు



కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు, అధికారులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో అవుట్ సోరింగ్స్ సిబ్బంది నియామకంపై శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వాడీవేడిగా చర్చ సాగింది. ఎంత మందిని నియమించారో తెలపాలని 2వ డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలి ప్రశ్నించారు. దీనికి ఎస్ఈ భాస్కర్ మాట్లాడుతూ 48 మందిని నియమించుకున్నామన్నారు. ఇందులో 28 మందిని ఉన్నతాధికారి ఆదేశాల మేరకు నియమించామని ఆయన సమాధానం ఇవ్వడంపై చర్చకు దారి తీసింది. ఆ ఉన్నతాధికారి ఎవరో తెలపాలంటూ కార్పొరేటర్లు అంజలి, అజయ్, రమ్య పట్టుబట్టడంతో అధికారులు నీళ్లు నమిలారు. సమాధానం వస్తేనే తప్పా వేరే ప్రశ్నకు వెళ్లనని భీష్మించారు. దీనికి మిగిలిన సభ్యులు వత్తాసు పలకడంతో మేయర్ కావటి మనోహర్ నాయుడు కలగజేసుకున్నారు. వివరాలు తీసుకురావాలని కార్పొరేటర్లకు సూచించారు. అవసరమైతే సిబ్బందిని ఆపేయాలని అధికారుల్ని ఆదేశించారు.

సిఫార్సు చేసినా ఫలితం లేదు: ఎమ్మెల్యే ముస్తఫా

పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉంటున్న తాను ఇద్దరిని పనిలో పెట్టుకోవాలని ఎన్నో సిఫార్సు లేఖలు ఇచ్చినప్పటికీ అధికారుల నుంచి స్పందన లేదన్నారు. ఇక తానే పెట్టుకుని నెలానెలా జీతం ఇస్తున్నానని తెలిపారు. వారు కూడా కార్పొరేషన్‌కే పనిచేస్తున్నారన్నారు. కాని గత సంవత్సరం ఉన్నతాధికారి పేరుతో 28 మందిని ఏ విధంగా పెట్టుకుంటారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఆ అధికారి సిఫార్సు లేఖను కౌన్సిల్‌కు చూపాలని పట్టుబట్టారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు చూపాలని, లేనిపక్షంలో నియామకాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిల్ పనులకు ఆమోదం తెలపడం.. అది కాగితాలకే పరిమితం కావడం పరిపాటిగా మారిందని తెలిపారు.

ఆర్వోబీ, ఆర్‌యూబీ నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్సీ లక్ష్మణరావు

నగరంలో ఐదు ప్రాంతాల్లో ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ లక్ష్మణరావు అధికారుల్ని కోరారు. దీనికి మేయర్ మాట్లాడుతూ ఈ విషయంపై ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డితో చర్చించామని, రైల్వే మంత్రి అపాయింట్‌మెంటు కూడా తీసుకున్నట్లు చెప్పారు. పార్లమెంటు ప్రారంభోత్సవం వల్ల ఆలస్యమైందని, వీలైనంత త్వరలో రైల్వే మంత్రిని కలిసి బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు.

పట్టించుకోని అధికారులు

టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు కూడా పనులు చేయడం లేదని, ఇంజినీరింగ్ అధికారుల్ని సంప్రదించినప్పటికీ ఫలితం లేదని కార్పొరేటర్ అందుగల సంతోష్ ఆరోపించారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులు ఆగిపోయి నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ మల్లవరపు రమ్య కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. 55వ డివిజన్‌లో డొంక రోడ్డు నుంచి శారదా కాలనీ ఆర్చి వరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరినా అధికారుల నుంచి స్పందన లేదని కార్పొరేటర్ అంబేడ్కర్ వాపోయారు. తన వార్డులో ఇంత వరకు అభివృద్ధి పనులే జరగలేదని, ఏదైనా ప్రశ్న వేయగానే అప్పటికప్పుడు హడావుడి చేసి టెండర్ ప్రక్రియ మొదలు పెడుతున్నారని కార్పొరేటర్ దూపాటి వంశీ ఆరోపించారు.

బైక్ స్టాండ్‌గా చలివేంద్రాలు

నగరంలో వేసవి దృష్ట్యా ఏర్పాటు చేసిన చలివేంద్రాలు బైక్ పార్కింగ్ కేంద్రాలు మారాయని కార్పొరేటర్ రమ్య ఆరోపించారు. ఎక్కడా సక్రమంగా పని చేయలేదని తెలిపారు. దీనిపై డెప్యూటీ మేయర్ డైమండ్ బాబు మాట్లాడుతూ ఒక్కోదానికి రూ.17వేల చొప్పున ఖర్చు చేసి ఏర్పాటు చేసిన చలివేంద్రాలు ఉపయోగం లేకుండా పోయాయని తెలిపారు. ఏ పని చేసినా స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియకుండా చేయడం అధికారులకు పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు. డివిజన్లలో పనులు కూడా సక్రమంగా జరగలేదని తెలిపారు. రోడ్లకు ప్యాచ్ వర్కులు వేసిన మూడు రోజులకే పోయాయని డెప్యూటీ మేయర్ తెలియజేశారు.

కుక్కల స్వైరవిహారం

కుక్కల స్వైరవిహారానికి అడ్డుకట్ట వేయాలంటూ డెప్యూటీ మేయర్ షేక్ సజీల కోరారు. కుక్కల దాడిలో గాయపడిన చిన్నారి ఫ్లెక్సీతో కౌన్సిల్‌లో ప్రదర్శనగా నిలబడ్డారు. డెప్యూటీ మేయర్ అయిన తనకు అధికారులు గౌరవం ఇవ్వడం లేదని, ఏ కార్యక్రమానికీ ఆహ్వానం తెలపకుండా అవమానిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధితో పాటు డెప్యూటీ మేయర్లకు సమాచారం ఇవ్వాలని అధికారుల్ని ఆదేశించారు.

టీపీఎస్‌ను సస్పెండ్ చేయాలి

తన వార్డులో రోడ్డు మీదకు ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీపీఎస్ సువర్ణకుమార్‌కు చెప్పినప్పటికీ ఫలితం లేదని కార్పొరేటర్ ఫర్హానా కోరారు. కార్పొరేటర్లకు డబ్బులు ఇస్తున్నామంటూ అసత్య ఆరోపణలు చేస్తున్న ఆయన్ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

అధికారుల తీరు బాగోలేదు

అమరావతి రోడ్డులో నిర్మాణంలో ఉన్న ఓ భవనం కూలిపోయి ముగ్గురు చనిపోతే దానికి తిరిగి అధికారులు ఏ విధంగా పర్మిషన్ ఇస్తారంటూ కార్పొరేటర్ యక్కలూరి మారుతి ప్రశ్నించారు. బాధితులకు నష్టపరిహారం లేబర్ డిపార్ట్‌మెంట్ నుంచి కాకుండా నిర్మాణ సంస్థ ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై వెంటనే తగిన విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. 55వ డివిజన్ కార్మిక శాఖ స్థలంలో ఓ వ్యక్తి బిల్డింగ్ నిర్మాణం చేసుకున్నప్పటికీ చర్యలు తీసుకోలేదని కార్పొరేటర్లు అంబేడ్కర్, వంశీ పట్టణ ప్రణాళిక అధికారుల తీరుపై మండిపడ్డారు. చిన్న షెడ్డు వేసుకుంటే వంద సార్లు వచ్చే అధికారులకు ఇవి కనిపించడం లేదా ? అంటూ ప్రశ్నించారు.

టీడీపీ హయాంలోనే దొంగ ఓట్లు

పశ్చిమ నియోజకవర్గంలో పలు బూత్‌లలో ఒకే డోర్ నంబర్‌పై వందల సంఖ్యలో ఓట్లు ఉన్నాయని టీడీపీ ఫ్లోర్ లీడర్ కోవెలమూడి రవీంద్రకు లేవనెత్తిన ప్రశ్నకు నగరపాలక సంస్థ అధికారులు కంగుతినే సమాధానం ఇవ్వడంతో ఆయన మిన్నకుండిపోయారు. ఒకే డోర్ నంబర్‌పై వందల సంఖ్యలో ఉన్న ఓటర్లు అంతా టీడీపీ హయాంలోనే ఉన్నారని, 2019 తరువాత కూడా అవే కంటిన్యూ అవుతూ వచ్చాయని అదనపు కమిషనర్ పెద్ది రోజా కౌన్సిల్ సమావేశంలో సమాధానం తెలియజేశారు. దీనిపై మేయర్ కావటి మనోహర్ నాయుడు స్పందిస్తూ టీడీపీ హయాంలోనే ఈ విధంగా ఓట్లు నమోదైతే.. ఇప్పుడు రాద్ధాంతాం చేస్తారా? అంటూ మండిపడ్డారు. అలా అయితే తాను పదివేల మెజార్టీతో గెలిచే వాడనని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. టీడీపీ చేసిన అక్రమాలు వల్ల తాను ఓడిపోయాయని, అధికారులు దీనిపై నిగ్గు తేల్చితే నైతికంగా గెలిచినట్లవుతానని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.

కౌన్సిల్ హాలుకు న్యూ లుక్

నెహ్రూనగర్: ఆధునిక వసతులతో కౌన్సిల్ హాలును ఆధునీకరించినట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కె.ఎస్. లక్ష్మణరావు, చంద్రగిరి ఏసురత్నం, ఎమ్మెల్యేలు మొహమ్మద్ ముస్తఫా, మద్దాళి గిరిధర్‌లతో కలసి కౌన్సిల్ హాలును మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో సర్వసభ్య సమావేశాలు నిర్వహించడానికి గానూ 25 సంవత్సరాల కిందట అప్పటి కౌన్సిల్ సభ్యుల సంఖ్యను బట్టి నిర్మించారన్నారు. నేడు పెరిగిన సభ్యుల సంఖ్యకు అనుగుణంగా హాలును ఆధునీకరించినట్లు తెలిపారు.



కౌన్సిల్ హాలును ప్రారంభిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, కమిషనర్ కీర్తి, మేయర్ కావటి మనోహరనాయుడు, ఎమ్మెల్సీలు

కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, నగర పాలక సంస్థ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వర్షాలు

- తెనాలిలో 57.2 మి.మీ. వర్షం
- సగటున 17.4 మి.మీ. వర్షపాతం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాను తొలకరి పలకరించింది. నైరుతి రుతు పవనాల ప్రభావంతో బుధవారం సాయంత్రం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో వర్షం కురిసింది. తెనాలి, మేడికొండూరు, గుంటూరు తూర్పు, పశ్చిమ, దుగ్గిరాల మండలాల్లో భారీగా.. మిగిలిన మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా తెనాలి మండలంలో 57.2 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 1.4 మి.మీ. వర్షం పడింది. సగటున 17.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. మేడికొండూరు మండలంలో 53.2 మి.మీ., గుంటూరు పశ్చిమ 41.6, గుంటూరు తూర్పు 33.6, దుగ్గిరాల 28.8, చేబ్రోలు 22.2, కాకుమాను 16, ఫిరంగిపురం 15.8, పెదనందిపాడు 14.8, ప్రత్తిపాడు 9.8, పెదకాకాని 7.8, వట్టిచెరుకూరు 3.6, తాడికొండ 3.2, తుళ్లూరు 2.4, కొల్లిపర మండలంలో 1.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ నెల సాధారణ వర్షపాతం 74.4 మి.మీ. కాగా, ప్రస్తుతానికి 62.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వచ్చే రెండు రోజులూ జిల్లాకు తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

25 నుంచి శ్రీ మద్భాగవత పారాయణ

పాత గుంటూరు: సంపత్‌నగర్‌లోని శ్రీ శృంగేరి శంకరమఠం శారదా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఈ నెల 25 నుంచి జులై 2వ తేదీ వరకు 108వ శ్రీమద్భాగవత పారాయణ పూర్వక సప్తాహ ప్రవచన జ్ఞానయజ్ఞ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 25న ఉదయం 6 గంటలకు గురువందనం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, పరిషత్ రక్షాబంధనం, రుత్విగ్వరణం, కలశ స్థాపనం, అఖండ దీపారాధన, శ్రీ మద్భాగవత మహత్య పారాయణ ప్రారంభం, 26 నుంచి జులై 2 వరకు ఉదయం 7 గంటలకు పారాయణ ప్రారంభం, మద్భాగవత మహాపురాణ ప్రవచనం, భాగవత పారాయణం, భాగవత ప్రవచనం, అనంతరం హారతి, అష్టావధాన సేవ, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందని పేర్కొన్నారు. 1న మహావిద్య హోమం, 2న విశేష హోమాలు, పూర్ణాహుతి, పండిత సన్మానాలు, అన్నసంతర్పణ జరుగుతాయని వివరించారు.

క్లుప్తంగా

25న మధువని సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈనెల 25న సుస్వరాల విరిజల్లు పేరున సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు మధువని సుస్వరాల పల్లకి సంస్థ వ్యవస్థాపకులు వెలిశెల మధుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీకి నివాళులు



గుంటూరు మెడికల్: బలిదాన్ దివస్ సందర్భంగా గుంటూరు బ్రాడీపేటలోని బీజేపీ సీనియర్ నేత యలవర్తిపాటి పాండురంగ విఠల్ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీ చిత్రపటానికి పలువురు బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విఠల్ మాట్లాడుతూ బీజేపీ వ్యవస్థాపకుల్లో డాక్టర్ శ్యామ్‌ప్రకాష్ ముఖర్జీ ఒకరని పేర్కొన్నారు. పార్టీ ఉన్నతికి, దేశాభివృద్ధికి ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దారా అంబేడ్కర్, ఏడుకొండలు గౌడ్, అవుల రామకోటేశ్వరరావు, రాజేష్, వెంకట్, చలపతిరావు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

గుంటూరు ఈస్ట్: బాలికపై లైంగిక దాడిచేసిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజీవ్‌గాంధీనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 13 సంవత్సరాల బాలిక చదువు మానేసి ఇంటి దగ్గర ఉంటోంది. సంజీవయ్యనగర్‌కు చెందిన సాయి అలియాస్ సాగర్ (20) ఆమెతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నాంటూ వెంటపడ్డాడు. స్నేహంగా మెలుగుతూ గత నెలలో పాడుబడ్డ బిల్డింగ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశాడు. కొద్దిరోజులుగా బాలిక అస్వస్థతకు గురైంది. తల్లిదండ్రులు ఆసుపత్రిలో పరీక్షలు చేయించగా, గర్భవతి అని నిర్ధారణ అయింది. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) కార్యాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఉపకార వేతనాలు, పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, మహిళా విభాగ రాష్ట్ర చైర్మన్ నిర్మల, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులు కేవీ బ్రహ్మం, కొత్తమాసు శ్రీనివాసరావు, చింతా కృష్ణారావు, నాగేశ్వరరావు, గార్లపాటి సత్యనారాయణ, రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

కోడి పందేలు వేస్తున్న ఐదుగురి అరెస్టు

గుంటూరు ఈస్ట్: కోడి పందేలు వేస్తున్న ఐదుగురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. సీతమ్మ కాలనీలో కొందరు కోడి పందేలు వేస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి నుంచి రూ. 3,500తో పాటు కోడి పుంజును స్వాధీనం చేసుకున్నారు.

గోవుల అక్రమ రవాణా చేస్తే కేసుల నమోదు

పట్నంబజారు: గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ షేక్ కరీం చెప్పారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో శుక్రవారం లారీ అసోసియేషన్ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా గోవుల్ని రవాణా చేస్తే ఉపేక్షించబోమని చెప్పారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడతామని తెలిపారు.

బుల్లెట్ చోరీల కేసులో నిందితుడి అరెస్టు

నాలుగు వాహనాల స్వాధీనం

గుంటూరు రూరల్: వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడే నిందితుడిని నల్లపాడు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అడవితక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ బి.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ద్విచక్ర వాహనాలు చోరీలు కేసులు నమోదైన ఘటనల్లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాలతో సౌత్ సబ్ డివిజన్ డీఎస్పీ మహబూబ్ బాషా నేతృత్వంలో కేసులను విచారించామన్నారు. ఇందులో బాపట్ల జిల్లా బేతపూడి గ్రామానికి చెందిన దేవర అబ్బన్న బుల్లెట్లు అయితే ఎక్కువ డబ్బు వస్తుందనే ఉద్దేశంతో వాటి దొంగతనాలకు పాల్పడుతున్నాడని విచారణలో తేలిందన్నారు. దీంతో నిందితుడి కోసం రెక్కీని నిర్వహించి చాకచక్యంగా అదుపులోకి తీసుకుని, విచారించగా నేరాల్ని ఒప్పుకున్నాడని తెలిపారు. అతడి వద్ద నుంచి రూ.7 లక్షల విలువ చేసే నాలుగు బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు నల్లపాడు, నగరంపాలెం, ప్రత్తిపాడు, చిలకలూరిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నేరం చేసినట్లుగా విచారణలో తేలిందన్నారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్ఐ అశోక్, కానిస్టేబుల్స్ సుబ్బారావు, షేక్ జాన్ సైదా, పోతురాజు, వెంకటనారాయణ, మస్తాన్‌వలి, జిల్లా ఐటీ కోర్ టీం బాలాజీని జిల్లా ఎస్పీ, సౌత్ సబ్‌డివిజన్ డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించినట్లు సీఐ బి.శ్రీనివాసరావు చెప్పారు.



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బుల్లెట్లు

జగనన్న సురక్షతో సంక్షేమ పథకాలపై మరింత పర్యవేక్షణ



జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీక్షిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, జెడ్పీటీసీలు, అధికారులు

గుంటూరు ఎడ్యుకేషన్: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మరింతగా పర్యవేక్షణ పెరుగుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు.తాడేపల్లిలోని కార్యాలయం నుంచి శుక్రవారం సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జెడ్పీ సమావేశ మందిరంలో వర్చువల్ విధానంలో ప్రత్యక్షంగా తిలకించారు. ముఖ్యమంత్రి ప్రసంగాన్ని హెనీ క్రిస్టినాతో పాటు జెడ్పీటీసీ సభ్యులు, అధికారులు తిలకించారు. అనంతరం హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నవీ లేనివీ పర్యవేక్షించడం కోసం సీఎం వై.ఎస్. జగన్ మహత్తరమైన కార్యక్రమాన్ని తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో జె.మోహనరావు పాల్గొన్నారు.

దేశభక్తి, క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సీసీ

గుంటూరు రూరల్: దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక సేవలో బాలురతో పాటు ఎన్‌సీసీ బాలికలు పాత్రను పోషించడం అభినందనీయమని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ అన్నారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో శుక్రవారం బాలిక ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు బీ, సీ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్టిఫికెట్ విభాగాల్లో ఉత్తీర్ణులై మంచి ఫలితాలు సాధించిన బాలిక ఎన్‌సీసీ క్యాడెట్లను అభినందించారు. కళాశాల నుంచి 31 మంది ఉత్తమ ఫలితాలను సాధించారన్నారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ బాలికలు ఎన్‌సీసీలో శిక్షణ తీసుకోవడం ద్వారా మానసిక స్థైర్యంతోపాటు ఆత్మరక్షణ పొందే విధంగా తయారవుతారని, తద్వారా సమాజాభివృద్ధికి పాటుపడతారన్నారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ కర్తవ్యం, క్రమశిక్షణ, ఐక్యతకు మారుపేరు ఎన్‌సీసీ అని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల నుంచి బీ సర్టిఫికెట్లను 20 మంది, సీ సర్టిఫికెట్లను 11 మంది పొందారని చెప్పారు. విద్యార్థులను డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కల్నల్ ప్రతాప్‌సింగ్, ఎన్‌సీసీ విభాగం అసిస్టెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ ఉష క్రాంతి అభినందించారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

నర్సింగ్ కళాశాల ఏవోగా వెంకట్రావు

గుంటూరు మెడికల్: గోరంట్లలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పరిపాలనా అధికారి (ఏవో)గా ఎ.వెంకట్రావు శుక్రవారం విధుల్లో చేరారు. ప్రిన్సిపాల్ ఎస్.కళావతమ్మను కలసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. బాపట్ల డీఎంహెచ్‌వో కార్యాలయంలో పరిపాలన అధికారిగా పని చేస్తున్న ఆయన బదిలీపై గుంటూరు నర్సింగ్ కళాశాలకు వచ్చారు. 2020లో ప్రభుత్వం పలు కేడర్లకు చెందిన పోస్టుల్ని కళాశాలకు మంజూరు చేసింది. కొంత మంది అభ్యర్థులు కోర్టుకు వెళ్లడం వల్ల అవి భర్తీ కాలేదు. ఇటీవల కేసును కొట్టివేయడంతో ప్రభుత్వం స్టాఫ్ నర్సులకు ప్రమోషన్లు ఇచ్చి నర్సింగ్ ట్యూటర్స్‌గా పోస్టింగ్‌లు ఇచ్చింది. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను కూడా నియమించింది. మొట్టమొదటి ఏవోగా వెంకట్రావు విధుల్లో చేరారు. ఆయన్ను ఆఫీస్ సూపరింటెండెంట్ రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు కూరాకుల శ్రీనివాస్, లంకపల్లి శ్రీనివాస్, సిబ్బంది అభినందించారు.



వెంకట్రావుకు అభినందనలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ కళావతమ్మ

అర్ధరాత్రి విస్తృత తనిఖీలు

పెదనందిపాడు: గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పెదనందిపాడు పోలీసు సిబ్బంది విస్తృత తనిఖీలు నిర్వహించారు. పెదనందిపాడు రామాలయం సెంటర్‌లో గురువారం అర్ధరాత్రి పలు వాహనాలను ఎస్ఐ అబ్దుల్ రెహమాన్, ఏఎస్ఐ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. బయట నుంచి వచ్చే వాహనదారుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు సమాచారం అందజేయాలని ప్రజలను కోరారు.



నెహ్రూనగర్‌లో చైన్ స్నాచింగ్

పట్నంబజారు: నగరంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం చైన్ స్నాచింగ్ జరిగింది. పట్టణానికి చెందిన అంజయ్య రోడ్డుపై నడిచి వెళుతుండగా ఇద్దరు యువకులు అడ్రస్ అడిగేందుకు ఆపారు. ఆయన వివరాలు చెబుతున్న సమయంలో మెడలోని బంగారు గొలుసు లాక్కుని పరారయ్యారు. అయితే, ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని కొత్తపేట పోలీసులు తెలిపారు. సంఘటనకు సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

IN THE COURT OF THE HON'BLE PRINCIPLE JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MAGISTRATE OF FIRST CLASS AT SANGAREDDY
Execution Petition No.121 of 2022
in
O.S.No. 1231 of 2021.

Between:
Mallagundla Lakshmi Gayatri
W/o. Mallagundla Vijay Kumar,
R/o. 3-103, Krishnaiahgari OWK Village & Mandal, Kurnool District
...Decree Holder/Plaintiff.
And
Uppala Srikanth
S/o. Uppala Janaki Ramaiah,
R/o. H.No.2-14-153/A, Syamala Nagar, Gunturu town and Mandal,
Guntur District-522002, AP
...Judgment Debtor/Defendant.

To,
Uppala Srikanth S/o. Uppala Janaki Ramaiah, Aged about 46 years, Occ: Private service, R/o. H.No.2-14-153/A, Syamala Nagar, Gunturu town and Mandal, Guntur District-522002, AP.

WHEREAS the Decree Holder has made an application in this court for execution of decree in suit No.1231 of 2021. Take Notice that on the 21st day of june 2023, the decree holder in the above suit presented an application/Draft Sale Deed to this court that the court may execute on your behalf the sale deed of the immovable property specified here under and that the **24th day of July 2023** is appointed for the hearing of the said application and that you are at liberty to appear on the said day and to state in writing any objection to the said draft sale deed.

Description of the Property

All that the property bearing Plot No.201 admeasuring 150 Sq.yds and Plot No.202, admeasuring 173 Sq.Yds, in total admeasuring 323Sq.Yds in Survey Nos. 182/A, 212 and 215/AA, Situated at Arathi Nagar or Indresham Village, Patancheru Mandal, Sanga Reddy District bounded by:
Plot No.201: North by: Plot No.202, South by: Plot No.200, East by: Survey No.182, West by: 25 feet Road.
Plot No.202: North by: Survey No.189, South by: Plot No.201, East by: Survey No.182, West by: 25 feet Road.

By order of Court.
Sd/- T.Mahesh Kumar (ACS, LL.M.)
B.Ravi Kumar, Advocates
Secunderabad -03
Ph : 7075145075

కుష్ఠు బాధితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): కుష్ఠు వ్యాధి బాధితులను గుర్తించేందుకు నెల రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరి యునిస్ తెలిపారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనలో భాగంగా రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ స్టడీ డిటెక్షన్ క్యాంపెయిన్)ను ఈ నెల 26 నుంచి నిర్వహించున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి మేరి యునిస్ మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని రాగిరంగు మచ్చలున్న వారిని గుర్తించాలని తెలిపారు. జులై 7వ తేదీ వరకు సర్వేను కచ్చితంగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కోటేశ్వరరావు నాయక్, ఎంపీహెచ్ఈవో కె.చెల్లమ్మ, పీహెచ్ఎన్ డి.నిర్మలాదేవి, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీపీఎంవో కోటేశ్వరరావు నాయక్, డాక్టర్ మేరి యునిస్